క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని చీపురుదుబ్బ ఫీడర్, గుండాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని గుడ్లబోరి ఫీడర్‌లో రెండు రోజుల పాటు మరమ్మతులు చేయనున్నట్లు ఏఈ రవీందర్ శనివారం తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గుడ్లబోరి, రణవెల్లి, వైగాం, టేకంగూడ, విజయనగరం, తాటినగర్, యాపలగూడ, గురుడుపేట, కన్నేపల్లి, బోదంపల్లి, కనికి, చీపురుదుబ్బ గ్రామాలకు ఆది, సోమవారాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

బీజేపీ సంబరాలు



అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర నాయకులు సతీశ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ మాట్లాడుతూ 2024లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. గణేశ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం వీక్షణ..

కాగజ్‌నగర్‌టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ 9 సంవత్సరాల పాలనలో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రూపొందించిన రియల్ సిటీ టు కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ నాయకులతో కలిసి వీక్షించారు.

మత్స్య సహకార సంఘం కార్యవర్గం

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో శనివారం గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మొగడ్‌దగడ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారి జి. నవీన్‌కుమార్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షులుగా ఎర్మ సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఆత్రం విలాస్, కార్యదర్శి సిడాం భరత్, సభ్యులుగా కొరత బక్కయ్య, నైతం రాఘునాథ్, ఎర్మ సురేశ్, ఉర్వత్ బక్కయ్య, సుధాకర్, ఎర్మ భాస్కర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



చింతలమానెపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో రామకృష్ణ

చింతలమానెపల్లి: పంట విత్తనాలను డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రామకృష్ణ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్ల వద్ద ఉన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. పత్తి విత్తనాలను రూ. 853ల ఎంఆర్‌పీ ధరకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రశీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. విత్తనాల అమ్మకాలకు సంబంధించి పలు సూచనలు అందించారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్మన్

కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారుల గుర్తింపు, రుణాలు మంజూరు చేసి వారికి ఆర్థిక చేయూతనిచ్చి అండగా నిలవడంతో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్య, మెప్మా ప్రతినిధులు మోతీరాం, ఉషాలు అవార్డు అందుకున్నారు.

‘సర్వర్’ లేక సతమతం..!

- రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తులకు జీసీల తంటాలు
- ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- గడువు దగ్గర పడుతుండడంతో ఆందోళన




వాంకిడిలోని మీ సేవ కేంద్రం వద్ద అర్జీదారులు

వాంకిడి: కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బీసీ కులాల్లోని 15 రకాల కులవృత్తులు చేసుకునే వారు ఇందుకు అర్హులుగా పేర్కొంది. కాగా ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆయా కుల వృత్తులదారులు కుల, ఆదాయ, నివాసం ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు, మీసేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. మీ సేవ కేంద్రాలలో ఆన్‌లైన్ చేసుకున్న అర్జీదారులు తహసీల్దార్ కార్యాలయంలో సంతకాల కోసం బారులు తీరుతున్నారు. తెలంగాణ మీసేవ పోర్టల్ సర్వర్ మొరాయిస్తుండటంతో సిబ్బంది కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. గడువు దగ్గరపడుతుండటంతో ప్రతీ రోజు వందల మంది మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సుమారు వారం రోజుల నుంచి పగటి వేళల్లో సర్వర్ పని చేయకపోవడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మిగిలింది రెండు రోజులే..

ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన చివరి గడువు రెండు రోజులే మిగిలి ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 20వ తేదీ వరకు కుల వృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు కుల, ఆదాయ, నివాసం ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అర్జీదారులు ఒకేసారి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతీరోజు కార్యాలయానికి వందల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ధ్రువపత్రాల ఆన్‌లైన్ పనులు జరుగుతుండటంతో సర్వర్ మొరాయిస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుందని, ప్రతీరోజు కనీసం 10 నుంచి 20 దరఖాస్తులను కూడా జారీ చేయలేకపోతున్నట్లు కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు.



మీసేవ పోర్టల్ సర్వర్ ఎర్రర్ చూపిస్తున్న దృశ్యం

దరఖాస్తుదారుల ఆందోళన

దరఖాస్తులు సమర్పించేందుకు ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. అప్లయ్ చేసి వారం గడుస్తున్నా ధ్రువపత్రాలు జారీ చేయడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తుదారులు ఒకేసారి అధిక సంఖ్యలో అప్లయ్ చేయడంతో సర్వర్ డౌన్ అయిందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. పగటి వేళల్లో సర్వర్ లేకపోవడంతో అర్జీదారుల గడువును దృష్టిలో పెట్టుకుని రాత్రుల్లో ఆన్‌లైన్ చేస్తున్నట్లు సిబ్బంది తెలుపుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారు కూడా మళ్లీ నూతనంగా అప్లయ్ చేసుకుంటున్నారని, కొత్త జిల్లాల ప్రాతిపాదికన తీసుకున్న కుల సర్టిఫికెట్లతో ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. నూతనంగా ఆదాయం, నివాసం సర్టిఫికెట్లు పొందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు

వారం నుంచి తిరుగుతున్నా..



కుల, ఆదాయ, నివాసం ధ్రువపత్రాల కోసం గత వారం రోజుల నుంచి తిరుగుతున్నా. ప్రతీరోజు సర్వర్ లేదంటున్నారు. కుల వృత్తులపై మాత్రమే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. గడువు దగ్గరపడుతుండడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నాం.

– కొండపర్తి స్వాతి, ఖమాన గ్రామం

గడువులోగా జారీ చేయాలి



ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. వారం రోజుల నుంచి సర్వర్ డౌన్ పేరుతో సర్టిఫికెట్లు జారీ చేయడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– సత్య నారాయణ, ఇందాని గ్రామం

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- అధికారులు అందుబాటులో ఉండాలి
- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం: మండల సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరయ్యారు. ముందుగా మండలంలోని 52 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ యాసంగిలో రైతుబంధు పెట్టుబడి సాయం కింద 11,047 మంది రైతులకు రూ.16.31 కోట్లు రైతుల ఖాతాల్లో జమైనట్లు పేర్కొన్నారు. 27 కుటుంబాలకు రైతుబీమా అందించినట్లు తెలిపారు. వైద్యశాఖ నుంచి హెచ్‌వీ పద్మ నివేదికలు చదివి వినిపించారు. మూడు నెలల కాలంలో 32 డయేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. పశుసంవర్ధక శాఖ నుంచి పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ నివేదికలు అందించారు. ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 518 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని అందులో 5400 మంది సభ్యులు ఉన్నారన్నారు. మూడు నెలల కాలంలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.45 కోట్లు రుణాలు అందించామని పేర్కొన్నారు. స్త్రీనిధి కింద రూ.1.18 కోట్ల రుణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. మిషన్‌భగీరథ డీఈ పృథ్వీరావ్ మాట్లాడుతూ మండలంలోని 49 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. శంకరాపురం గ్రామంలో తాగునీరు రావడం లేదని సరఫరా చేయాలని ఎమ్మెల్యే డీఈని ఆదేశించారు. ఇరిగేషన్ ఏఈ అశోక్ మాట్లాడుతూ మండలంలోని కోత్మీర్ దుబ్బగూడ చెరువుకు మరమ్మతులు ప్రారంభించామన్నారు. కర్జి చెరువు మత్తడికి రూ. 5.92 కోట్లతో ప్రభుత్వానికి నివేదికలు పంపామని, త్వరలో నిధులు మంజూరు కానున్నాయన్నారు. పీఆర్ ఏఈ ఆత్మారాం మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద మండలంలో 52 సీసీరోడ్లు మంజూరు కాగా అందులో 46 పూర్తి చేశామని మిగతా ఆరు పనులు ప్రారంభించలేదన్నారు.

అధికారులు అభివృద్ధికి సహకరించాలి

మండలస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. అందవెల్లి వంతెన నిర్మాణం కొనసాగుతుందన్నారు. సాంకేతికతను వినియోగించి పైప్‌లైన్ తొలగిస్తుండడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లేందుకు అప్రోచ్‌రోడ్డు పూర్తి చేసి రాకపోకలు సాగిస్తామని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చిన్న ఐనం, శంకరాపురం గ్రామాల్లో బోర్లు వేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, వైస్‌ఎంపీపీ సురేశ్, తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చెరువుకట్ట కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

చింతలమానెపల్లి: చెరువుకట్ట మట్టిని తొలగించి, కట్టను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్ మష్కూర్ అలీకి శనివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న చెరువు నుంచి సమీపంలో నిర్మిస్తున్న ఇళ్ల స్థలాలకు మట్టిని తరలించేందుకు స్థానిక ట్రాక్టర్ యజమానులు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఈక్రమంలో చెరువులోని మట్టిని తరలించడానికి మత్తడి పక్క నుంచి దారి ఏర్పాటు చేసుకున్నారని, ఇందుకు ఏకంగా చెరువు కట్టను కూల్చివేశారని పేర్కొన్నారు. దీంతో కట్ట ప్రమాదకరంగా తయారవడంతో గ్రామస్తులు ఆందోళన చెంది నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం అందించినట్లు వివరించారు. కట్టవద్ద పనులకు ఎవరికి అనుమతినివ్వలేదని అధికారులు తెలపడంతో పనులను అడ్డుకున్నట్లు రైతులు పేర్కొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనోత్సవాలు



మోడిలో నిర్వహిస్తున్న గ్రామసభ



నృత్యం చేస్తున్న గిరిజన యువతులు

కెరమెరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, గిరిజన సంక్షేమ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గిరిజన సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. కొన్ని చోట్ల గ్రామసభలు నిర్వహించి గిరిజన సంబరాల ప్రాధాన్యతను అధికారులు, నాయకులు ప్రజలకు వివరించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఏంపీవో సుదర్శన్, ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

మేడిపల్లిలో..

సిర్పూర్(టి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో గిరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్(టి) ఎంపీడీవో రాజేశ్వర్ గిరి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి గిరి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కౌటాలలో..

కౌటాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలంలోని గురుడుపేట, కౌటాల, వీర్దండి, గుడ్లబోరి గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేశారు. గిరిజనోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో గిరిజనులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో ఎంపీపీ విశ్వనాథ్ ఎంపీవో మౌనిక, సర్పంచులు మౌనిశ్, రాందాస్, సునంద, రేణుక, ఉప సర్పంచ్ తిరుపతి, బండు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, బాపు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోతెపల్లిలో గిరిజన గ్రామసభ

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రా మంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని సర్పంచ్ దాసరి చంద్రమౌళి అధ్యక్షతన గిరిజన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో గిరిజన సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజ లకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

రెబ్బెన: విధులకు సక్రమంగా హాజరు కాకుండా గైర్హాజరవుతున్న ఉద్యోగులకు సోమవారం ఉదయం 10 గంటలకు గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు ప్రతీనెల 10 కంటే తక్కువ మస్టర్లు ఉన్న ఏరియా ఉద్యోగులు, వారి కుటుంబాలతో కలిసి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

శాస్త్రీయ సమాజ స్థాపనకు పోరాటం

ఎదులాపురం: శాస్త్రీయ సమాజ స్థాపనకు సీపీఎం పోరాడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్లో శనివారం కామ్రేడ్ కనక గణపతి, ఆత్రం భగవంతురావుల వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనక గణపతి, ఆత్రం భగవంత్ రావులు దేశంలోని అట్టడుగు వర్గాల ప్రగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. దేశంలో ఎర్రజెండా ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాఘవులు, కిరణ్, సచిన్ పాల్గొన్నారు.

పొడి దుక్కుల్లో విత్తు..!

- వద్దంటున్న అధికారులు
- జిల్లాలో ఇంకా కురవని వర్షాలు
- వరుణుడి రాక కోసం ఎదురుచూపులు

ఖరీఫ్ కాలం సాగు ప్రణాళిక..

పంట	సాగువిస్తీర్ణం(ఎకరాల్లో)
పత్తి	3,42,000
వరి	58,780
కంది	35,000
సోయాబీన్	9,657
పెసర	3,017
జొన్న	2,962
మొక్కజొన్న	855
మినుము	387
వేరుశనగ	180
ఇతర	2,200
మొత్తం	4,55,038



పొడి దుక్కిలో పత్తి విత్తనాలు పెడుతున్న కూలీలు

కౌటాల: వానాకాలం వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షానికి ట్రాక్టర్లతో దుక్కులు సిద్ధం చేస్తున్నారు. తొలకరి జల్లులు పడగానే విత్తాలని సన్నద్ధమవుతున్నారు. కానీ కొందరు పొడి దుక్కుల్లోనే విత్తనాలు విత్తుతున్నారు. ప్రస్తుతం ఎండలు వేసవి కాలం తలపిస్తూ పగటి ఉష్ణోగ్రతలు 40డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. ఈ తరుణంలో విత్తనాలు విత్తడం మంచిది కాదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మండుటెండల్లో విత్తనాలు

ప్రస్తుతం జిల్లా రైతులు వరుణుడి రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కాని జూన్ సగం గడిచినా వర్షాలు కురవడం లేదు. అయినా కొందరు రైతులు పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు విత్తుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను విత్తినట్లు తెలుస్తోంది. మండటెండల్లో రైతులు, కూలీలు పొలం పనుల్లో మమేకం అవుతున్నారు. విత్తనాలు వేసిన వెంటనే వర్షం కురిస్తే విత్తనాలు మొలకెత్తుతాయనే ఆశతో విత్తనాలు వేస్తున్నారు. వరి సాగుచేసే రైతులు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం, నారుమళ్ల సిద్ధం చేసే పనుల్లో మునిగిపోయారు. వర్షం కురిస్తే విత్తనాలు విత్తేందుకు రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నారు. అయితే విత్తనాలు విత్తేందుకు రైతులు తొందరపడొద్దని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు సరైనా వర్షం కూడా పడలేదని, 60 సెంటీమీటర్ల వర్షపాతం కురిసిన తర్వాతనే రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవాలని సూచిస్తున్నారు.

తొందరపడి విత్తుకోవద్దు



రైతులు వానాకాలం సాగుకు పొలాలు సిద్ధం చేసుకోవాలి. కాని విత్తనాలు విత్తుకునేందుకు రెండుసార్లు బాగా వర్షం కురిసిన తర్వాత భూమి చల్లబడినప్పుడు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. తొందరపడి పొడి దుక్కుల్లో విత్తుకోవద్దు. ఇప్పుడు భూమి అంతా వేడెక్కి ఉంది. వేడికి మొలకశాతం తక్కువగా వస్తుంది. దీంతో విత్తనాలు వృథా అవడంతో పాటు ఖర్చు కూడా అధికమవుతుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. – పి.రాజేశ్, ఏవో, కౌటాల

‘సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం’

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామానికి చెందిన కామ్రె మారుతి, రాంటెంకి రవికుమార్‌లకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోనప్ప సహకారంతో కామ్రె మారుతికి రూ. 32 వేలు, రాంటెంకి రవికుమార్‌కు మంజూరైన రూ. 60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వంజీరి గ్రామ సర్పంచ్ రమేశ్, నాయకులు లక్ష్మణ్, కిషన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మహార్ సంఘం గ్రామకమిటీ ఎన్నిక

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ మహార్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో మహార్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్, కుల పెద్దలు కచ్రు, వెంకటి, మెంగాజీ, అంబేద్కర్ యువజన అధ్యక్షుడు జాడి ప్రశాంత్, కిరణ్, సందీప్, గోవర్ధన్, గణపతి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో



ఆందోళన చేస్తున్న గోవర్‌గూడ గ్రామస్తులు

తిర్యాణి: గ్రామానికి తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దేవాయిగూడ గ్రామపంచాయతీ పరిధి గోవర్‌గూడ గ్రామస్తులు శనివారం కైరిగూడ ఓసీపీకి వెళ్లే రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెండు బోర్లు చెడిపోవడంతో తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గోవర్‌గూడ గ్రామానికి నీళ్లు అందడం లేదని, తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీ వెళ్లే దారిపై ధర్నా చేయడంతో బొగ్గు తరలించే లారీలు భారీగా నిలిచిపోయాయి. దీంతో సింగరేణి సంస్థ అధికారులు రంగంలోకి దిగి 24 గంటల్లో గ్రామంలోని రెండు బోర్లకు మరమ్మతులు చేపడుతామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

అప్రోచ్ పనులు వేగవంతం చేయాలి



అప్రోచ్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్, దహెగాం మండలాల మధ్య పెద్దవాగు అప్రోచ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అధికారులకు సూచించారు. శనివారం అప్రోచ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వానాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్రోచ్ పనులను పూర్తి చేసి ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆయన వెంట దహెగాం జెడ్పీటీసీ రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్, భీమన్న, రమేశ్ తదితరులు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

దహెగాం: మండలంలోని చౌక గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కోనప్ప భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయన్నారు. ఉపాధిహామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ రామారావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండలంలోని తుంగమడుగు గ్రామంలో సీసీరోడ్లు, వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తుంగమడుగు గ్రామం వరకు ఐటీడీఏ నిధులు రూ. 2.10 కోట్లతో సీసీరోడ్డుతో పాటు కల్వర్టులు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, సర్పంచ్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనులకు గుర్తింపు

నార్నూర్: బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం మండలంలోని సుంగాపూర్ కొలాంగూడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఎస్డీ ఎస్‌డీఎఫ్ రూ. 20 లక్షల నిధులతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జోడేఘాట్‌లో రూ. 25 కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దండారీ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే ఇప్పటి వరకు రూ. 50 లక్షల వరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచు జీజాబాయి ప్రేంసింగ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్ పాల్గొన్నారు.